సాక్షి ఒడిశా
శనివారం । 10 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు:	రూ.3,50,239
బంగారం:	3 గ్రాముల 120 మిల్లీ గ్రాములు
వెండి:	64 గ్రాముల 750 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



జీవన' గానం..

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు.

- 8లో



నవంబర్ నుంచి నవీన్ రాష్ట్ర పర్యటన

బిజూ జనతా దళ్ (బీజేడీ) అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు

పర్లాకిమిడి: నాసిరకం ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గజపతి జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. గజపతి జిల్లాలో కొందరు నాన్ బ్రాండ్ ఎరువులు అమ్మకం చేస్తున్నట్లు జిల్లా అడ్మిన్స్ట్రేషన్ దృష్టిలోకి వచ్చినట్లు శుక్రవారం తెలిపారు. ఎవరైనా నాసిరకం ఎరువులు విక్రయించిన, స్టాకు ఉంచిన, పంపిణీ చేస్తే సెక్షన్ 152 (1)బీఎస్- 2023 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



పేదలకు సరుకులను అందజేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది ఆదివాసీ మహిళలకు నిత్యావసర వస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. బియ్యం, నూనె, కందిపప్పు, ఉప్పు, బంగాళదుంపలు వంటి నిత్యావసరాలను ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని అందజేశారు. ప్రతి నెల ట్రస్టు ఆధ్వర్యంలో పేద ఆదివాసీ మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీధర్ ఆచార్య (తిరుపతి) పేదలకు సహకరించాలన్న ఉద్దేశంతో రాయగడలో సంస్థను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నళిని చెప్పారు.

కిరాణా దుకాణంలో చోరీ



దొంగతనం జరిగిన దుకాణం

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి బుడాగుడ పంచాయతీ పరిధి కుంభారుగురుతులి కూడలిలో ఉన్న ఒక కిరాణా దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కుంభారుగురుతలి గ్రామానికి చెందిన లాడి సంతోష్ కుమార్ గ్రామానికి సమీపంలోని కూడలిలో కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకొని వచ్చే ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే గురువారం రాత్రి వ్యాపార లావాదేవీలు ముగించుకుని ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం దుకాణాన్ని తెరిచేందుకు వెళ్లగా తలుపులకు వేసిన తాళాలు విరిగిపడి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. 69 వేల రుపాయల నగదు, ఇన్వర్టర్ బ్యాటరీ, మరి కొన్ని దినుసులు దొంగిలించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

కిడ్నాప్, రేప్ కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

జయపురం: బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50వేలు జరిమానా విధించారు. జయపురం స్పెషల్ పోక్సో జడ్జి ఈ కేసులో 12 మంది సాక్షులను విచారించారు. అనంతరం హరిబందు కొరాలియ(33) దోషిగా తేలడంతో శిక్ష ఖరారు చేశారు. జరిమానా చెల్లించకపోతే 15 నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని చెప్పారు. అలాగే బాధితురాలికి ప్రభుత్వం తరపున జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం ద్వారా రూ.6 లక్షలు ఆర్థిక సాయం చేయాలని తీర్పులో పేర్కొన్నారు. 2022లో కొట్‌పాడ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. 2022 ఫిబ్రవరి 18న బాధితురాలు పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు, బంధువులు అన్ని చోట్లా వెతికినా ఆమె జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారి శేషదేవ్ బెహరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. ఆ దర్యాప్తులో హరిబందు బాలికను కిడ్నాప్ చేసి నెల రోజుల పాటు ఉంచి రేప్ చేసినట్లు తేలింది. బాలిక కూడా అతని బంధువు ఇంటిలోనే దొరికింది. కేసులో ప్రభుత్వ న్యాయవాదిగా డాక్టర్ గాయిత్రి దేవి పాల్గొన్నారు.

- ఉప్పొంగుతున్న మహా నది పరివాహికలు
- వరదలో మునిగి తేలుతున్న లోతట్టు ప్రాంతాలు

ఉప్పొంగినది



హిరాకుడ్ జలాశయం నుంచి విడుదల అవుతున్న వరద నీరు

భువనేశ్వర్:

మహా నది పరివాహికలు ఉప్పొంగుతున్నాయి. ఎగువ చత్తీస్‌గఢ్ ప్రాంతంలో కుండపోత వానలతో హిరాకుడ్ జలాశయం నీటితో కళకళలాడుతోంది. అప్పటికే జలాశయం గేట్లు తెరిచి అంచెలంచెలుగా నీటిని లోతట్టు ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. మహా నది పరివాహక నదుల్లో నీరు కట్టలు తెంచుకుని ప్రవహిస్తోంది. వాటి పక్క రహదారులు ఏరుల్ని తలపిస్తున్నాయి. ఈ మార్గాల్లో జన జీవనం తాత్కాలికంగా స్తంభించిపోయింది. ప్రధానంగా కటక్, ఖుర్దా, పూరీ జిల్లాలు ప్రభావితమవుతున్నాయి. హిరాకుడ్ జలాశయం నుంచి విడుదలైన 5 లక్షల 50 వేల క్యూసెక్కుల నీరు ఈ జిల్లాల లోతట్టు ప్రాంతాల్లో వరద పరిస్థితిని ఆవిష్కరించింది.

ముప్పు లేనట్లే

హిరాకుడ్ జలాశయం వరద పరిస్థితిపై ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించి తీర వాసుల్ని అప్రమత్తం చేసినట్లు ఖుర్దా కలెక్టర్ తెలిపారు. దీంతో పశు, మానవ ప్రాణ హాని వంటి ముప్పు తొలగినట్లేనని పేర్కొన్నారు. ఇప్పటికే రహదారులపై 3 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. జలాశయం నీరుతో పరివాహిక నదుల్లో నీరు పొంగి ప్రవహిస్తుండగా.. అల్ప పీడనం ప్రభావంతో తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదిలో నీటిమట్టం గట్టు దాటింది. ఈ తీర ప్రాంతాల్లో గుడులు, గోపురాలు, పంట పొలాలు, రహదారులు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి,

నీట మునిగిన అమ్మవారి ఆలయం

కటక్ జిల్లా అఠొగొడొ బొడొబొంధియాణి రహదారి జలమయమైంది. ఈ ప్రాంతంలో బొడొబొంధియాణి అమ్మవారి ఆలయం జల వలయంలో చిక్కుకుంది. తిగిరియా, ఉత్తర బంకిలోని వ్యవసాయ భూములు నీట మునిగాయి. ఖుర్దా జిల్లా తీర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి తాండవిస్తోంది. ఈ జిల్లాలో హిరిములొ, దుర్గాపూర్, ఒరొబొరొ సింగ్ పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పొలాల్లో 4 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది.



ఉత్తర బంకిలో నీట మునిగిన పంట పొలాలు

హై అలర్టు

హిరాకుడ్ జలాశయంలో తాజాగా 6 గేట్లు తెరిచారు. దీంతో 14 గేట్ల గుండా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇంతకు ముందు విడుదల చేసిన వరద నీటితోనే లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. జలాశయం ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మహానదిలో నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. సంబల్‌పూర్, సోన్‌పూర్, నయాగడ్, అంగుల్, బౌధ్, పూరీ, ఖుర్దా, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా జిల్లాలకు హై అలర్టు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ముందలి వద్ద మహా నదిలో 5.78 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. నీటి మట్టం నియంత్రణపై యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉంటోందని జల వనరుల శాఖ ఇంజినీరు భక్త రంజన్ మహంతి తెలిపారు. రాష్ట్రంలో వరదల పరిస్థితి లేదని అభయం ఇచ్చారు. రానున్న రోజుల్లో వర్షం తీవ్రత తగ్గుముఖం పడితే పరిస్థితి మరింత స్థిమితంగా ఉంటుందన్నారు. నదుల్లో నీటి మట్టం గరిష్ట పరిమితికి తాకకుండా నియంత్రణ చర్యలు చేపడతున్నట్లు పేర్కొన్నారు.



కటక్ జిల్లాలో నీట మునిగిన రహదారి



నీట మునిగిన అఠొగొడొ బొడొబొంధియాణి అమ్మవారి ఆలయం

కుంద్రా సమితి సమావేశంలో అసంతృప్తి జ్వాలలు



సభావేదికపై సమితి చైర్ పర్సన్ తదితరులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి సమావేశంలో అసంతృప్తి జ్వాలలు ఎగసి పడ్డాయి. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులు సమితి కార్యకలాపాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. అనేక పాఠశాల పై కప్పుల నుంచి నీరు కారుతున్నా పట్టించుకోవటం లేదని నిలదీశారు. ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయాల వల్ల రోగులు పాట్లు పడుతున్నారని, మేఘా ప్రాజెక్టుల పనుల్లో అవినీతి తాండవిస్తోందని, ఎరువులు లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. సమితిలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ, సహాయక పనుల నిధులు దారి మళ్లుతున్నాయని విమర్శించారు. ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా సమితిలో కొన్ని పాఠశాలల్లో 300 మంది విద్యార్థులు ముగ్గురు లేక నలుగురు టీచర్లు మాత్రమే ఉన్నారని, సమితిలో 135 పాఠశాలలు ఉండగా కేవలం 363 మంది టీచర్లు పనిచేస్తున్నారని తెలిపారు. ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. కుంద్రా సమితి సభా గృహంలో సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూప భొత్ర మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి సమస్య పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు రాధా బినోద సామంతరాయ్, బిడొ కపిలేశ్వర తండి, సమితి ఉపాధ్యక్షులు తరణిసేన్ బిశాయి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

భిక్షమెత్తి.. నిరసన తెలిపి



నబరంగ్‌పూర్‌లో నివాళులు అర్పిస్తున్న మున్నా త్రిపాఠి, ఎమ్మెల్యేలు



భిక్షాటన చేస్తున్న యోధుల కుటుంబ సభ్యులు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న దృశ్యం



నాడు యోధులను బంధించిన జైలు

కొరాపుట్: స్వాతంత్ర్య యోధుల కుటుంబ సభ్యులు భిక్షమెత్తి తమ నిరసనను తెలిపారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని మెయిన్ రోడ్డుపై శుక్రవారం వారంతా భిక్షాటన చేశారు. క్రాంతి దివస్ నేపథ్యంలో ఇక్కడి స్మృతిని కాపాడుకోవాలని ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటం సమయంలో వీరులను నిర్బంధించడానికి ఇదే చోట బ్రిటిష్ వారు జైలు నిర్మించారు. దీని నిర్మాణం 1932లో పూర్తయ్యింది. ఇక్కడ 118 మంది ఖైదు చేయగా 8 మంది ఇక్కడే కన్నుమూశారు. నాటి పోరాటానికి గుర్తుగా క్రాంతి దివస్ నిర్వహిస్తుంటారు. ఈ జైలు ఆవరణలో ఏటా యోధుల కుటుంబ సభ్యులు సంఘం అధ్యక్షుడు మున్నా త్రిపాఠి నేతృత్వంలో కార్యక్రమాలు జరుగుతాయి. ఈ జైలును జాతీయ స్మృతిగా గుర్తించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం మున్నా త్రిపాఠి, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మజ్జి, మనోహర్ రంధారి, ఏడీఎంలు నవీన్ చంద్ర నాయక్, మహేష్ చంద్ర నాయక్ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం ఈ డిమాండ్‌ను లేవనెత్తారు. దశాబ్దాలుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నిరసన తెలుపుతూ భిక్షాటన చేశారు. అనంతరం అక్కడే బైఠాయించారు.

• శబరీ.. చూపించవా దారి



శబరి నది దాటుతూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ఈ నది పేరు శబరి. నదిని దాటుతున్న వారు కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితి నందిగాం పంచాయతీ మధుబిశాలి గ్రామ విద్యార్థులు. ఈ గ్రామంలో కేవలం 5వ తరగతి వరకే ప్రాథమిక పాఠశాల ఉంది. ఆపై చదవాలంటే ఇలా నది దాటాల్సిందే. వానాకాలంలో శబరి నిండుగా ప్రవహిస్తూ ఉంటుంది. కానీ చదువుపై మక్కువతో పిల్లలు ప్రమాదకరంగా నది నాటుతూ బడికి వెళ్తున్నారు. ఇలాంటి దృశ్యాలు ఈ చుట్టుపక్కల చాలా కనిపిస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. పాలకులు మేలుకుని నదులపై వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.

- జయపురం

చెట్టును ఢీకొన్న పోలీసు వ్యాను



చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన పోలీసు వ్యాను

భువనేశ్వర్: పారిపోతున్న పశువుల అక్రమ రవాణా వాహనాన్ని వెంబడించిన పోలీసు వ్యాన్ చెట్టును ఢీకొట్టింది. ఇంతలో పశువులతో నిండిన వాహనం సునాయాసంగా దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో 6 మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 5 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో కటక్ ఎస్సిబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. ఢెంకనాల్ జిల్లా బెల్టొటికిరి కైమట్టి రోడ్డులో ఈ సంఘటన చోటు చేసుకుంది.

ఉపాధ్యాయుడు బలవన్మరణం

- ఇంద్రావతి నదిలో దూకి ప్రాణాలు తీసుకున్న వైనం



కలియా మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, కుటుంబ సభ్యులు

కొరాపుట్: ఉపాధ్యాయుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇంద్రావతి నదిలో దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ విషాద ఘటన నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పట్టణంలోని నువాబందు వీధిలో నివసిస్తున్న సుంకరి కలియా (37) గురువారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ఇంటి నుంచి వెళ్లిపోయారు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు అతని కోసం రాత్రంతా గాలించారు. శుక్రవారం ఉదయం ఇంద్రావతి పాత బ్రిడ్జి సమీపంలో కలియా ద్విచక్ర వాహనాన్ని గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందితో నదిలో గాలింపు చర్యలు చేపట్టగా కలియా మృతదేహం బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా కలియా నందాహండి సమితి మిర్గాన్‌గుడ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు మున్నా త్రిపాఠి నది వద్దకు చేరుకొని కలియా మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.



సుంకరి కలియా(ఫైల్)

కారు బోల్తా.. నలుగురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం



గాయాలతో హరిశ్చంద్ర భార్య, పిల్లలు

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి బుడాగుడ పంచాయతీ గురుతులి, కొండకొర గ్రామాల మధ్య కారు బోల్తా పడి నలుగురు గాయపడ్డారు. గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో కాశీపూర్ సమితి గొడవీధికి చెందిన హరిశ్చంద్ర గొడో, భార్య, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. వారు తమ కారులో సెరిగుమ్మ పంచాయతీలోని లకాపాయి గ్రామానికి గురువారం నాడు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను కల్యాణ సింగపూర్ ఆస్పత్రికి తరలించారు.

బంగారుదుంప..!

- బిగుసుకుంటున్న బంగాళదుంప వివాదం
- బెడిసికొట్టిన ప్రభుత్వం వ్యూహం
- పశ్చిమ బెంగాల్‌కు వాహనాల రవాణా నిలిపివేత



కటక్ జిల్లా సామాజిక సంఘటన్ హెచ్చరిక పోస్టర్



పశ్చిమ బెంగాల్‌కు వాహనాల రవాణా అడ్డుకుంటున్న ప్రజా సంఘాలు



భువనేశ్వర్: బంగాళ దుంపల సంక్షోభం కొత్త మలుపు తీసుకుంటోంది. క్రమంగా ఇరుగు పొరుగు ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మధ్య వైరిభావం పెరుగుతోంది. రాష్ట్రానికి బంగాళ దుంపల రవాణా నిలిపివేతపై నిరసన సెగలు వేడెక్కుతున్నాయి. పొరుగు రాష్ట్రం వైఖరితో రాష్ట్రంలో నిత్య వంటకం బంగాళా దుంప నిల్వలు అడుగంటుతున్నాయి. దీంతో రిటైలు ధర చుక్కలను తాకుతోంది.

నీరు గారిన విపక్ష నేత విన్నపం

రాష్ట్రంలో బంగాళా దుంపల సంక్షోభం తీవ్ర రూపం దాల్చకుండా విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీకి లేఖ రాసి బంగాళా దుంపల కొరత నివారణకు చేయూతనివ్వాలని తొలుత అభ్యర్థించారు. ఇంతలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యాయని ప్రకటించారు. త్వరలోనే దిగుమతి ఆరంభమై కొరతను అవలీలగా ఎదుర్కొంటామని ప్రకటించారు.

కొరవడిన సమన్వయం

రాజకీయంగా రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం కొరవడడంతో రాష్ట్రంలో బంగాళాదుంపల కొరత పంజా విసిరింది. దీంతో ఉత్తర ప్రదేశ్ నుంచి ఆలుగడ్డలు రప్పించి పశ్చిమ బెంగాల్ ఆగడాలకు కళ్లెం వేస్తామని రాష్ట్ర పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో ప్రకటించడంతో పరిస్థితి మరింత బిగుసుకుంది. అయితే ఉత్తరప్రదేశ్ అంతంత మాత్రంగానే ఆలుగడ్డలు ఎగుమతి చేసింది. రాష్ట్రంలో కొన్ని చోట్ల వీటి లభ్యత ఆరంభమైంది. అయితే ఈ దుంపలు రుచించడం లేదని రాష్ట్ర ప్రజలు పెదవి విరుస్తున్నారు. పశ్చిమ బెంగాల్ బంగాళా దుంపలపై మక్కువ కనబరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు పొరుగు రాష్ట్రంతో రాజకీయ సంబంధాల పరిరక్షణకు దెబ్బ తీసింది.

ప్రజా సంఘాల రచ్చ

ఆలుగడ్డల దిగుమతిలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యంతో ప్రజా సంఘాలు వీధికెక్కి రచ్చ చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పశ్చిమ బెంగాల్ కు చేరాల్సిన సరుకు రవాణా వాహనాలు నిలిపి వేస్తున్నారు. కటక్ మంగులి కూడలి వద్ద పశ్చిమ బెంగాల్ వైపు వెళ్లాల్సిన వాహనాల రవాణా అడ్డుకుని శుక్రవారం ఆందోళనకు దిగారు. అటు నుంచి బంగాళా దుంపలు విడుదల చేసేంత వరకు, ఇటు నుంచి ఆహార పదార్థాల రవాణా వాహనాలు విడిచి పెట్టేది లేదని హెచ్చరించారు. 16వ నంబర్ జాతీయ రహదారి మంగులి కూడలి ప్రాంతంలో వాహనాల రవాణా స్తంభించి పోయాయి. పరిస్థితి చేయి దాటిపోకుండా శాంతిభద్రతల పరిరక్షణపై ప్రభుత్వ యంత్రాంగం నిఘా వేయాల్సిన పరిస్థితులు పొంచి ఉన్నాయి. రాజకీయ ద్వేషంతో సాధారణ ప్రజానీకం బాగోగులకు నీళ్లొదిలి ఆలుగడ్డల రవాణాకు అడ్డు తగులుతున్న పశ్చిమ బెంగాలుకు, రాష్ట్రం నుంచి ఏ ఒక్క వాహనాన్ని ఒడిశా సరిహద్దు దాటనీయమని కటక్ జిల్లా సామాజిక సంఘటన్ హెచ్చరించింది.

క్లుప్తంగా

ప్రత్యేక భృతి

భువనేశ్వర్: క్రాంతి దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ మాఝీ సరికొత్త ప్రకటన చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు ప్రత్యేక భృతి మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. కుటుంబ్ యోజన కింద ఈ భృతిని కల్పిస్తారు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను త్వరలో గుర్తిస్తారు. అర్హులైన వారికి భృతి మంజూరు చేస్తారు.

విద్యార్థి అదృశ్యం

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి రామగిరి పోలీసు పంటిలో 9వ తరగతి చదువుతున్న తన కుమారుడు గురువారం నుంచి కనిపించడం లేదని మంకిడి గ్రామానికి చెందిన జయ నాయిక్ శుక్రవారం ఫిర్యాదు చేశాడు. అతడిచ్చిన ఫిర్యాదులో తన కుమారుడు బిజయ నాయిక్ (14) కందులిబెడ గ్రామ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడని పేర్కొన్నాడు. కొద్ది రోజుల క్రితం సెలవు పెట్టి ఇంటికి వచ్చాడని వివరించాడు. అనంతరం సెలవులు అయిపోవడంతో గురువారం మధ్యాహ్నం 1 గంట సమయంలో మంకిడి గ్రామంలోని తన ఇంటి నుంచి కందులిబెడలో హాస్టల్‌కు బయల్దేరాడన్నారు. అయితే రాత్రి 8 గంటల వరకు హాస్టల్‌కు చేరలేదని తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల కారు ఢీకొని యువకుడి మృతి



పోలీస్‌స్టేషన్ ముట్టడించిన గ్రామస్తులు

భువనేశ్వర్: పోలీస్ కానిస్టేబుల్ కారు ఓ యువకుడిని ఢీకొట్టింది. దేవ్‌గడ్ జిల్లా బారకోట్ పోలీస్ ఠాణా సమీపం బొలొండా కూడలిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఢీకొన్న తర్వాత సుమారు 100 మీటర్లు దూరం దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బొలొండా గ్రామానికి చెందిన సిపున్ పాత్రో చనిపోయాడు. ఆగ్రహించిన గ్రామస్తులు పోలీస్ ఠాణా ముట్టడించారు. మృతుని కుటుంబీకులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కుప్పకూలిన క్రేన్



క్రేను నేలకొరిగిన దృశ్యం

భువనేశ్వర్: కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రి సముదాయ భవన విస్తరణ నిర్మాణ ప్రాంగణంలో శుక్రవారం దుర్ఘటన చోటు చేసుకుంది. నింగిని తాకే స్థాయి భవనాల నిర్మాణంలో వినియోగించే భారీ క్రేన్ విరిగిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. ప్రమాద సమయంలో ఈ క్రేను నిలకడగా ఉన్నందున ప్రాణాపాయం వంటి ఘోర ప్రమాదం తప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సిబ్బంది నిర్వహణ లోపంతో బూమ్ దెబ్బతిని నేలకు ఒరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో బీహారుకు చెందిన ముబారక్ అన్సారి, మరో ఇద్దరు స్థానికులు దీనబంధు బెహరా, బంశీధర్ మల్లిక్ గాయపడ్డారు. వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఓనిగెడ్డ నీరు విడుదల

బూర్జ: ఓని గెడ్డ నీరు ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. మండలంలో గల డొంకలపర్త పంచాయతీలో హరిపురం, పల్లాపురం నుంచి మండలానికి సాగునీరు అందించే ప్రధాన కాలువ ద్వారా పాలకొండ మండలం వెలగవాడ గ్రామ దగ్గర ఓని గెడ్డ ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల చేయడంతో పలువురు నాయకులు, ఆయకట్టు దారులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు కింద పడి ఆత్మహత్య

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్‌సీ గేటు దిగువన మురళీధర్ పాత్రో (64) అనే వ్యక్తి బస్సు కింద తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇక్కడ రైలు గేటు వేయడంతో బస్సులన్నీ ఆగి ఉన్నాయి. గేటు ఎత్తాక అన్ని బస్సుల కదిలాయి. సరిగ్గా అదే సమయంలో శ్రీకాకుళం నుంచి పలాస వస్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు వెనుక టైర్ల కింద ఆయన తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీయగా కాశీబుగ్గకు చెందిన మురళీధర్ పాత్రో (64)గా గుర్తించారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కల్లేపల్లి నుంచి కిల్లిపాలెం మీదుగా విశాఖపట్నంకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీను గ్రామ రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. సేఫ్‌సైడ్ కస్టోడియన్ నిమిత్తం లారీను సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు.



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కద్రక



మల్కన్‌గిరి: బోండా నృత్యం



మల్కన్‌గిరి: శాంతాలి నృత్యం

జీవన గానం..



రాయగడ: సంప్రదాయ దుసుల్లో ఆదివాసీ యువతులు

పర్లాకిమిడి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జీ'వన' గానం వినిపించింది. గజపతి జిల్లా గుమ్మా సమితి తరంగడ పంచాయతీ పర్సంబ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత ఆదివాసీ మంచ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా సభ జరిపారు. సవర భాష, లిపి, సంస్కృతి కాపాడాలని ఆదివాసీ నేత సాంబారో శోబోరో అన్నారు. అలాగే స్థానిక దండుమాల వీధిలో సీపీఎం కార్యాలయం నుంచి రాజవీధి మీదుగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో సీపీఎం లిబరేషన్ నాయకులు శ్రీనివాసబెహరా, సునాం మండళ్ పాల్గొన్నారు. ఒడిషా ఆదివాసీ అధికార్ మంచ్ నేతృత్వంలో మహిళలు కూడా పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లాలో పలు చోట్ల ఆదివాసీ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మల్కన్‌గిరిలో ఆదివాసీ సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. పలు రకాల నృత్యాలు ప్రదర్శించారు.

- ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ఆదివాసీలది బతుకు పోరాటం

రాయగడ: బతుకు పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక అన్నారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం జిల్లా ఆదివాసీ సమాజం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరిగింది. సమావేశంలో మాజీ మంత్రి జయరాం పంగి, ఆదివాసీ మహా సంఘానికి చెందిన ప్రతాప్ పువ్వల, బసంత కుమార్ ఉలక, మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, చక్రధర్ బిడిక, గంగాధర్ పువ్వల, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక తదితరులు పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు పట్టణంలో భారీ ఊరేగింపు, నృత్య ప్రదర్శనలు జరిగాయి.



మల్కన్‌గిరి: ర్యాలీలో పాల్గొన్న గిరిజన తెగలు ప్రజలు

బొయిపరగుడలో..

జయపురం: బొయిపరిగుడలో కొరాపుట్ జిల్లా ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఆదివాసీ ప్రజల హక్కులు, గిరిజన సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షించుకోవాలని నేతలు పిలుపునిచ్చారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



పర్లాకిమిడి: పర్సంబ గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ర్యాలీ



జయపురం: బొయిపరిగుడలో ఆదివాసీ సంఘం నిర్వహించిన ర్యాలీ

హరిశ్చంద్ర భక్షిపాత్రోకి నివాళులు

కొరాపుట్: దివంగత మంత్రి హరిశ్చంద్ర భక్షిపాత్రోకి పలువురు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో పర్యటించిన బీజేడీ సీనియర్ నాయకుడు అతున్ సవ్యసాచి కలెక్టరేట్ జంక్షన్ వద్ద ఉన్న భక్షిపాత్రో విగ్రహానికి నివాళులు అర్పించారు. అలాగే మల్కన్‌గిరి జిల్లాలో పోలవరం ముంపు ప్రాంతాలలో పర్యటించిన బీజేడీ నాయకులు కూడా భక్షిపాత్రో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొరాపుట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, బ్రహ్మపుర బీజేడీ సీనియర్ నాయకుడు బ్రుగు భక్షిపాత్రో తదితరులు ఉన్నారు.



కొరాపుట్‌లో హరిశ్చంద్ర భక్షిపాత్రో విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీజేడీ నాయకులు

గనుల అపరిమిత తవ్వకాలకు రూ. 1.18 లక్షల జరిమానా చెల్లింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని గనుల భూముల్లో అపరిమిత తవ్వకాల అపరాధానికి భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ధనియా వెస్ట్ 'జి' లీజుదారుడు శుక్రవారం శ్రీమందిర్ కార్యాలయంలో ఒక కోటి 18లక్షల రూపాయల జరిమానాను సమర్పించారు. ఖుర్దా జిల్లాలో రాళ్ల తవ్వకానికి అనుమతించిన 19 గనుల తవ్వకం లీజుదారులు పరిమితి మించి తవ్వినట్లు ధ్రువీకరించారు. దీంతో శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ చర్యలు చేపట్టారు. 7 రోజుల్లోగా జరిమానా చెల్లించకుంటే తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తాఖీదులు జారీ చేశారు. మైనింగ్ కాంట్రాక్టు రద్దు చేయడంతోపాటు సంబంధిత లీజు దారులను బ్లాక్ లిస్టులో చేర్చడం జరుగుతుందని హెచ్చరించారు.

దర్పదళన రథం వడ్రంగి కృష్ణ చంద్ర మహరణ మృతి



కృష్ణ చంద్ర మహరణ

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రథయాత్రలో దేవీ సుభద్ర కోసం దర్పదళనం రథం తయారు చేసే ప్రధాన వడ్రంగి కృష్ణ చంద్ర మహరణ మృతి చెందారు. ఆయన మృతిపై ముఖ్యమంత్రి మోహన్ మాఝీ సంతాపం వ్యక్తం చేశారు. దర్పదళన రథం ప్రధాన వడ్రంగిగా పనిచేసిన కృష్ణ చంద్ర మహరణ 70కి పైగా రథాలను నిర్మించారు. సుదీర్ఘంగా 70 ఏళ్ల పైబడి రథం తయారీలో పాలుపంచుకోవడం విశేషం. సుదీర్ఘ వడ్రంగి జీవనంలో ఆయన 5 నవ కళేబర మహోత్సవాల్లో తన వంతు పాత్రని విజయవంతంగా పోషించారు. నవ కళేబర మహోత్సవం అరుదుగా జరిగే మహోత్సవం.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక ఆదివారం పేట సమీప బుచ్చిపేట వద్ద ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ దేవదానం తెలిపిన వివరాల మేరకు గురువారం రాత్రి ఆదివారంపేటకు చెందిన మామిడి హేమంతరావు నడుచుకుంటూ వస్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో ఎడమ కాలి మడమకు ఫ్రాక్చరైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవంబర్ నుంచి నవీన్ రాష్ట్ర పర్యటన



బీజేడీ సమన్వయ కమిటి సభ్యులతో నవీన్ నివాస్‌లో సమావేశం

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ (బీజేడీఅ) అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నారు. ఈ పర్యటన నవంబర్ నెలలో ప్రారంభిస్తారు. రాష్ట్ర ప్రజలను, అట్టడుగు స్థాయి పార్టీ కార్యకర్తలను ప్రత్యక్షంగా కలిసి బాగోగుల్ని పర్యవేక్షించడం పర్యటన లక్ష్యంగా పేర్కొన్నారు. సీనియర్ నేత దేబీ ప్రసాద్ మిశ్రా అధ్యక్షతన జరిగిన బీజేడీ తొలి రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమన్వయ కమిటీ సమావేశంలో నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కార్యకర్తల్లో మనోధైర్యాన్ని పెంపొందించేందుకు తాను వ్యక్తిగతంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీ, అమ్మకంపై నిషేధం

పర్లాకిమిడి: ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో విగ్రహాలను తయారు చేయడం, విక్రయాలపై నిషేధం విధిస్తూ జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న గణపతి, దసరా పూజల కోసం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసే విఘ్నేశ్వరుని, దుర్గాదేవి ప్రతిమలు తయారీ, అమ్మకం, ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం విధిస్తున్నట్టు స్పష్టం చేశారు. భారతీయ నాగరిక సురక్షిత సంహిత 2023 కోర్టుకు వెళ్లి జడ్జిమెంట్ ఇచ్చిన దృష్ట్యా గజపతి జిల్లాలో ప్లాస్టిక్ సంచుల వినియోగంపై కూడా నిషేధం విధిస్తున్నట్టు స్పష్టం చేశారు.



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు

వేడుకగా శ్రావణ శుక్రవారం

పర్లాకిమిడి: శ్రావణ శుక్రవారం తొలివారం సందర్భంగా స్థానిక పోడుగు దేవాలయంలోని పార్వతీ దేవి అమ్మవారి కోవెలలో పెద్ద ఎత్తున మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే శ్రీలలితాదేవి కోవెలలో విశాలాక్షి అయ్యంగార్ ఆధ్వర్యంలో లలితా పారాయణం జరిపించారు. అలాగే బాలసదన్ ఇంగ్లిస్ మీడియం పాఠశాలలో లలితాదేవికి కుంకుమ పూజలను భాస్కరభట్ల రవిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం నాడు తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఈ కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు.



పూజలను నిర్వహిస్తున్న భాస్కర, రాంజీ ఆచార్యులు



శ్రీరామలింగేశ్వర ఆలయంలో కుంకుమ బొట్లు పెడుతున్న ముత్తైదువులు



పొడుగు కోవెలలో పార్వతీదేవి అమ్మవారు.



పొడుగు కోవెలలో లలితా పారాయణం

సకాలంలో వర్షాల నష్టం అంచనాకు ఆదేశాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని సకాలంలో అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభావిత జిల్లా కలెక్టర్లకు లేఖ జారీ చేసింది. నష్టాన్ని అంచనా వేసిన తర్వాత వీలైనంత త్వరగా నివేదిక సమర్పించాలని ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ) కార్యాలయం వారిని ఆదేశించింది. ప్రధానంగా సంబల్‌పూర్, సోన్‌పూర్, నయాగఢ్, అంగుల్, బౌధ్, పూరీ, ఖుర్దా, కటక్, జగత్‌సింగ్‌పూర్ మరియు కేంద్రాపడా అనే 10 జిల్లాల కలెక్టర్లను అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. భారీ వర్షాల వైపరీత్యం తగ్గించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేకంగా కోరింది. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీట మునిగిన రోడ్లు, కల్వర్టులు, వంతెనలపైకి నీరు రాకుండా నియంత్రించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే ఎస్‌ఆర్‌సీకి తెలియజేయాలని కూడా కోరారు. ప్రజల భద్రతను నిర్ధారించడానికి మరియు ఏదైనా సంభావ్య ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యగా పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌సీ కార్యాలయం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. జిల్లా కలెక్టర్ల నుంచి వచ్చిన అంచనా నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

జీ(వి)తమింతేనా..?

- మూడు నెలలుగా జీతాల్లేక అల్లాడిపోతున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం, గెస్ట్ లెక్చరర్లు
- నిలిచిన జూనియర్ కాలేజీ కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్
- రెన్యువల్ కూడా రాకపోవడంతో జీతాల కోసం ఎదురుచూపులు



తరగతి గదిలో కాంట్రాక్ట్ లెక్చరర్

శ్రీకాకుళం న్యూకాలనీ, నందిగాం: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు జీతం, జీవితం కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదు. దీనికి తోడు రెగ్యులరైజేషన్, రెన్యువల్ ప్రక్రియలను కూడా కొత్త ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లడం లేదు. దీంతో వారంతా నిరాశలో కూరుకుపోయారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 370 మంది కాంట్రాక్టు లెక్చరర్లు, 25 పార్ట్‌టైం లెక్చరర్లు, 95 మంది గెస్ట్ లెక్చరర్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్నారు. ఏప్రిల్ 30తో సీఎల్స్ కాంట్రాక్టు ముగిసినా వారి సేవలు మాత్రం వేసవిలో సైతం నిరంతరాయంగా కొనసాగించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 12 నెలలకు వీరికి జీతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మే, జూన్, జూలై నెలలకు సంబంధించి జీతాలు విడుదల కావాల్సి ఉంది. నాలుగో నెల గడుస్తున్నా ఇప్పటి వరకు రెన్యువల్ ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో వారంతా అనేక పాట్లు పడుతున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీకి పీరియడ్‌కు రూ.150 చొప్పున గరిష్టంగా రూ.10వేల జీతంతో పదేళ్ల నుంచి పనిచేస్తూ వెట్టిచాకిరీ చేస్తున్నారు. తమను కాంట్రాక్ట్ లేదా పార్ట్ టైం వ్యవస్థలో విలీనం చేయాలని అప్పట్లో ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారు. అది జరిగే వరకు కనీసం మానవతా దృక్పథంతో ఆలోచించి తమకు రూ.37వేల జీతం 11 నెలల పాటు ఇవ్వాలన్న వినతికి గత ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా స్పందించినట్లు ఆ సంఘ రాష్ట్ర నాయకులు డాక్టర్ శరత్‌బాబు, బడ్డ గణేష్ తెలిపారు.


వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎంతో మేలు..

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీతాలను రూ.27వేల నుంచి రూ.37,100లకు పెంచడమే కాకుండా 12 నెలల కాలానికి జీతాలు అమలయ్యేలా చర్యలు తీసుకున్నారు. డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు పీఆర్సీని వర్తింపజేస్తూ రూ.20వేలు పెంచి అమాంతం రూ.57,100లకు జీతాన్ని ఫిక్స్ చేసి ఆపద్బాంధవుడిలా నిలిచారు. అయితే 2024లో మళ్లీ వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కుంటి సాకులతో మేనెల జీతానికి ఎసరు పెట్టే దిశగా అడుగులు వేస్తోంది. అది తెలుసుకున్న కాంట్రాక్టు లెక్చరర్లు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

రెగ్యులరైజేషన్ ఉన్నట్టా..? లేనట్టా..?

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న, 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు కలిగిన 10,117 మందిని గుర్తించి క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. అయితే మళ్లీ కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి వచ్చిన అనేక విజ్ఞప్తుల నేపథ్యంలో 2014 జూన్ 2 నాటికి సర్వీసులో ఉన్నవారందరినీ రెగ్యులర్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు ఏపీ చట్టసభల్లో నూతనంగా 30 యాక్టుకు రూపొందించి, అందుకు అనుగుణంగా జీఓ నంబర్ 114ను జారీ చేశారు. అయితే వివిధ కారణాలతో జాప్యం జరిగి ఎన్నికల కోడ్ ముంగిట రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఆఖరి దశలో నిలిచిపోయింది. దీంతో మిగిలిన ప్రక్రియను కొత్త ప్రభుత్వం పూర్తి చేయాలని అధ్యాపకులు కోరుతున్నారు.


రెగ్యులర్ చేయాలి



రాష్ట్రంలో మాతోపాటు ఇప్పటికే పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులంతా ఏప్రిల్ 1 నుంచి రెగ్యులర్ అయ్యారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన రెగ్యులరైజేషన్ ప్రక్రియను కూటమి ప్రభుత్వం వెంటనే మొదలుపెట్టాలి. ఎలాంటి అడ్డంకులు లేకుండా కాంట్రాక్టు లెక్చరర్లు అందరినీ పర్మినెంట్ చేయాలి. అప్పటి వరకు ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా 12 జీతంతో కూడిన రెన్యువల్‌ను వెంటనే ప్రకటించాలి.

– సుంకరి దొరబాబు, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘ జేఏసీ నాయకులు


ఇబ్బందులు పడుతున్నాం..



మాకు మే నెల నుంచి జీతాలు లేవు. ప్రభుత్వం నుంచి రెన్యువల్ ఉత్తర్వులు రాకపోవడంతో బిల్లులు పెట్టడానికి, జీతాల చెల్లింపుకు అవకాశం లేదు. దీంతో మూడు నెలల నుంచి నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పెద్దలు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రాష్ట్రంలో పనిచేస్తున్న సీజేఎల్స్‌కు 12 నెలలతో కూడిన రెన్యువల్‌ను విడుదల చేయాలని విన్నవిస్తున్నాం.

– సనపల షణ్ముఖరావు, కెమిస్ట్రీ సీనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్

ఉత్తర్వులు వచ్చిన వెంటనే జీతాలు



ప్రభుత్వ నుంచి జీఎల్స్ రెన్యువల్స్ ఉత్తర్వులు రాకుండా జీతాల బిల్లుల చెల్లింపు జరగడానికి వీలు కాదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాల చెల్లింపులు జరుగుతాయి. అయితే కాంట్రాక్ట్ లెక్చరర్ల తమ కాలేజీల్లో పనిచేసుకోవడానికి ఎలాంటి ఆటంకం, ఇబ్బంది లేదు. వారం రోజుల్లో రెన్యువల్స్ ఉత్తర్వులు వెలువడవచ్చు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే జీతాల బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శివ్వాల తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ, శ్రీకాకుళం జిల్లా

క్లుప్తంగా

జాబ్ మేళాలో 67 మంది ఎంపిక



ఎంపిక ధ్రువీకరణ పత్రాలతో అభ్యర్థులు

విజయనగరం అర్బన్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంఆర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 67 మందిని తదుపరి దశకు ఎంపిక చేశారు. సంగీత మొబైల్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, రిలయన్స్ జియో ఫైబర్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీల్లో వివిధ కేడర్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు మొత్తం 251 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ పర్యవేక్షణలో జరిగిన ఈ మేళాలో ఎంఆర్‌కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, కంపెనీలు హెచ్‌ఆర్‌లు జావీద్, జ్ఞానేశ్వర్, ఎస్.సూరిబాబు, చక్రధర్, యంగ్ ప్రొఫెషనల్ యశ్వంతబాబు, ఉపాధి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సంరక్షణ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపిక



విజేతలతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు

బొబ్బిలి: ఏపీ స్టేట్ బయో డైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో 'జీవ వైవిధ్య సంరక్షణ-యువత పాత్ర' అన్న అంశంపై బొబ్బిలి డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. స్థానిక ట్రిపుల్‌ఎస్ డిగ్రీ కాలేజ్‌లో శుక్రవారం నిర్వహించిన వక్తృత్వ, షార్ట్‌ఫిలిం తదితర పోటీల్లో బాడంగి, పెంట, రేజేరు, కలువరాయి, కోరపు కొత్తవలస, శికారుగంజి విద్యార్థులు పోటీపడగా వివిధ విభాగాల్లో విజేతలను డిప్యూటీ ఈఓ కె.మోహన రావు అభినందించారు. వారంతా ఈనెల 12న విజయనగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారని నిర్వాహకులు ఎస్ఎస్ఎం రమేష్, ఐఎస్‌వీ ప్రసాద్, కె.సింహాచలం వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఎద్దులు

గంట్యాడ: లారీలో 40 ఎద్దులను అక్రమంగా తరలిస్తుండగా మండలంలోని రామవరం జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. దత్తిరాజేరు మండలం పెదమానపురం పశువులసంత వద్ద కొనుగోలు చేసి వాటిని తుని సంతకు తరలిస్తుండగా గంట్యాడ పోలీసులకు సమాచారం రావడంతో పట్టుకున్నారు. పశువులు కొనుగోలు చేసిన పెదమానాపురానికి చెందిన రాజాన రామారావు, తమిళనాడు రాష్ట్రం దండిగాం మండలానికి చెందిన లారీ డ్రైవర్ వి. అప్పలకృష్ణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం

సాలూరు రూరల్: మండలంలోని కురుకుట్టి పంచాయతీ మూల తాడివలసలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ శుక్రవారం తెలిపారు. గ్రామ శివారు గంజాయిభద్ర గెడ్డలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు వీఆర్‌ఓకు తెలియజేయగా ఆయన పోలీసులకు సమాచారమందజేశారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

రామభద్రపురం: మండలంలోని రావివలస పంచాయతీ పరిధి చదరడవలస గిరిజన గ్రామానికి చెందిన ఓ బాలిక పురుగు మందు తాగేసిన నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీలాద్రి పొట్టన్న దొర కుమార్తె గౌరమ్మ(16) ఇంటి తలుపులు వేయకుండా బయట ఆటుకుంటుంటే తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన గౌరమ్మ ఈ నెల 7వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన తల్లిదండ్రులు ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞాన ప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

పార్వతీపురంటౌన్: విజయవాడలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆశాజ్యోతి అయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలని చూడడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు.

రక్తదాన ఉద్యమంలో కలెక్టర్

- స్వయంగా రక్తం ఇచ్చి..
- 'మేము' సైతం కార్యక్రమం ప్రారంభం



రక్తదానం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: రక్తదాన ఉద్యమంలో పాల్గొనేందుకు ముందుకు రావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి 'మేము సైతం' రక్తదాన ఉద్యమం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన ఉద్యమంలో కలెక్టర్ స్ఫూర్తితో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఉద్యోగులు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజీ నేతృత్వంలో 65 మంది రక్త దానానికి పేర్లను నమోదు చేసుకుని ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తం డిమాండ్‌ను తీర్చడం, దీర్ఘకాలిక రక్త కొరతను పరిష్కరించడం, రక్తదానం ప్రాముఖ్యం, ప్రాణాలను రక్షించడంలో దాని ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడం, జిల్లాలో సాధారణ రక్తదాతల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని చేపట్టామని తెలిపారు. అన్ని మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. జిల్లాలో 50 రోజుల వ్యవధిలో మొదటి దశ పూర్తవుతుందని, వారం రోజుల నుంచి పది రోజుల వ్యవధిలో మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామని చెప్పారు.

రక్తదాత పేరు నమోదుకు వెబ్‌పోర్టల్

జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక మాట్లాడుతూ 'మేము సైతం' కార్యక్రమంలో రక్త దాతగా నమోదు చేసుకోవడానికి వెబ్ పోర్టల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో శిబిరంలో కనీసం 50 యూనిట్ల రక్తం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మండలంలో రక్తదాన శిబిరాలను సమన్వయం చేసేందుకు మండల స్థాయిలో ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

మండలాల్లో షెడ్యూల్ ప్రకారం శిబిరాలు

రక్తదాన కార్యక్రమానికి మండల స్థాయి షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12న గుమ్మలక్ష్మీపురం, 26న కురుపాం, సెప్టెంబర్ 5న పాలకొండ, 15న సీతంపేట, 28 న పాచిపెంట, అక్టోబర్ 2న వీరఘట్టం, 12న జియ్యమ్మవలస, 22న సీతానగరం, నవంబర్ 2న బలిజిపేట, 14న సాలూరు, 26న భామిని, డిసెంబర్ 1న మక్కువ, 10న కొమరాడ, 24వ తేదీన గరుగుబిల్లిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నామని జాయింట్ కలెక్టర్ శోభిక న్నారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందిస్తూ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎస్.సేతు మాధవన్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి



రక్తదాతలను అభినందిస్తూ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

డా.ఎంవీ ఆర్.కృష్ణాజీ, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి ఎ.రాజశేఖర రెడ్డి, సామాజిక కార్యకర్త టి.శివ కేశవ రావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్పీ వకుల్ జిందాల్



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి వెల్ఫేర్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది చెప్పిన సమస్యలను విన్న ఎస్పీ జిందాల్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. వ్యక్తిగత, వృత్తిపరమైన , శాఖాపరమైన సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తానని చెప్పారు. తనకు వచ్చిన విన్నపాల్లో పోలీస్ సిబ్బంది బదిలీలు, ప్రమోషన్‌లు, ఆరోగ్యపరమైన సమస్యలు, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు నిలిపివేయాలని కోరుతూ వచ్చినవే ప్రధానంగా ఉన్నట్లు తెలిపారు.

వనంగుడిలో చిన్నారులకు ఊయల



వనంగుడిలో ఊయలలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు చిన్నారులకు ఆశీస్సులను అందించేందుకు గాను దేవస్థానం అధికారులు రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి ఆలయ ఆవరణలో ఊయలను శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊయల్లో ఉంచి పూజాదికాలు చేశారు. అమ్మవారి పాదాల వద్ద తమ బిడ్డలను వేయాలనుకునే వారంతా ఈ ఊయల్లో వేసి, తల్లి ఆశీస్సులు పొందుతారని ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. భక్తుల సహాయ, సహకారాలతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థంలో శ్రావణమాస శోభ

- ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



పుష్పాలంకరణలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో సుందరకాండ హవనం, ఆస్థాన మంటపంలో నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. అనంతరం ఉపాలయంలో కొలువుదీరిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వై శ్రీనివాస రావు, అర్చకులు నరసింహాచార్యులు, సాయి రామాచార్యులు, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

హరేకృష్ణ భక్తుల సందడి

ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానాన్ని హైదరాబాద్‌కు చెందిన హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థకు చెందిన భక్తులు శుక్రవారం దర్శించి సందడి చేశారు. ఐటీ, ఇంజినీరింగ్, తదితర రంగాల్లో స్థిరపడిన సుమారు 80 మంది యువకులు ఆలయానికి విచ్చేసి సీతారామస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో హరేకృష్ణ భజనలు చేపట్టారు. ఈ సందర్భంగా హరేకృష్ణ యూత్ ఎంపవర్ మెంట్ ప్రతినిధి సహదేవ సకా ప్రభు పలు ఆధ్యాత్మికపరమైన సూచనలు అందించారు. యువతలో భక్తిభావాన్ని పెంపొందించడం వల్ల సన్మార్గంలో నడిచేందుకు ఆస్కారం ఉందన్నారు. సనాతన హిందూ సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ ఎంపవర్‌మెంట్ ప్రతినిధి బందుదాస ప్రభు పాల్గొన్నారు.



ఐటీ ప్రొఫెషనల్స్‌కు ఆధ్యాత్మిక సూచనలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధి సహదేవ సకా ప్రభు



రామకోనేరు గట్టుపై హరేకృష్ణ నినాదాలు చేస్తున్న భక్తులు

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి గ్రామం వద్ద గంటా బెల్లం అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనదారుడు వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. హెచ్‌సీ గురుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు.

690 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం సీజ్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల అధికారులు

చీపురుపల్లి: మండలంలోని మెట్టపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 690 కేజీల పీడీఎస్ బియ్యాన్ని శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, చీపురుపల్లి రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడి చేసి శుక్రవారం పట్టుకున్నారు. స్థానికులు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రామారావు, పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ పిన్నింటి రామారావులు మెట్టపల్లి గ్రామంలో దాడులు చేపట్టి గ్రామానికి చెందిన సత్యవరపు ఈశ్వరరావు, సత్యవరపు భాస్కరరావులకు చెందిన పాత ఫ్లోర్‌మిల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 690 కేజీలు బియ్యం పట్టుకున్నారు. అనంతరం పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి నిల్వ ఉంచిన సత్యవరపు ఈశ్వరరావు, భాస్కర రావులపై 6 ఎ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఎస్‌డీటీ రామారావు మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం ఎవరు కొనుగోలు చేసినా చట్టరీత్యా శిక్ష తప్పదని హెచ్చరించారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం..

విజయనగరం పూల్‌బాగ్: క్విట్ ఇండియా స్ఫూర్తితో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ పిలుపునిచ్చారు. మహిళలపై అత్యాచారాలు పెరగడానికి కారణమైన మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి పారదోలాలని నినాదాలు చేశారు. డ్రగ్స్‌ను నిర్మూలిస్తామని ఎల్‌బీజీ నగర్‌లో మహిళలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వి. లక్ష్మి, పుణ్యవతి, కుమారి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో 10మంది అరెస్ట్

- ఎస్పీ వకుల్ జిందాల్



టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణా, వినియోగం కేసులో పదిమంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాబామెట్ట నుంచి డబుల్ కాలనీకి వెళ్లే దారిలో గంజాయి అక్రమంగా కలిగి ఉన్న నలుగురు నిందితులను, గంజాయి వినియోగించిన మరో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. పట్టుబడిన నలుగురు నిందితుల్లో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన పటాన్ బాషా అలీ రెండేళ్లుగా బాబామెట్టలో నివాసం ఉంటున్నట్లు, ఒడిశా రాష్ట్రం కించుమండ సంతలోని గుర్తు తెలియని వ్యక్తి వద్ద పదికిలోల గంజాయి కొనుగోలు చేసి, ఇతరులకు విక్రయించే క్రమంలో పోలీసులకు పట్టుబడినట్లు విచారణలో అంగీకరించాడని తెలిపారు. మిగిలిన ముగ్గురు నిందితుల్లో షేక్ కాళీషా, పాత్రో మారయ్యలు విజయనగరం పట్టణానికి చెందినవారని, అలాగే భోగాపురానికి చెందిన తూతిక శ్యామ్ అనే 19ఏళ్ల యువకుడు ఉన్నారన్నారు. వీరు ముగ్గురూ పటాన్‌బాషా అలీ దగ్గర రెండేసి కిలోలు చొప్పున గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తునట్లు విచారణలో తేలిందని తెలిపారు. ఈ కేసులో భాగంగా భోగాపురంలో గంజాయి కొనుగోలు చేసి పీలుస్తున్న ఇంజినీరింగ్, డిప్లమో, హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు నలుగురు, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వివరించారు.

టీచర్ల సర్దుబాటు మార్గదర్శకాలు మార్చాలి

- ఆపస్ జిల్లా కమిటీ డిమాండ్



వినతిపత్రం అందుకుంటున్న డీఈఓ ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: పాఠశాలల్లో ఉపాధ్యాయల సర్దుబాటు ప్రక్రియ కోసం రూపొందించిన మార్గదర్శాలను మార్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సభ్యులు శుక్రవారం డీఈఓ ఎస్.ప్రేమకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే 117 జీఓ ప్రకారం టీచర్ల సర్దుబాటు చేపట్టడాన్ని నిరసిస్తున్నామని పేర్కొన్నారు. కనీసం ఒక్కసారి కూడా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి చర్చించకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలు విడుదల చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 117 జీవో రద్దు చేసి ఉన్నత పాఠశాలల నుంచి మూడు, నాలుగు ఐదు తరగతులను ఉపసంహరించి ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని కోరారు. పదోన్నతుల తరువాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది కన్నా ఎక్కువ ఉన్న స్కూళ్లకు ఇద్దరు టీచర్లను నియమించాలి. సర్దుబాటు వీలుకాని పాఠశాలల్లో అకడమిక్ విద్యా వలంటీర్లను నియమించాలని సూచించారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు ఇజ్జిరోతు రామునాయుడు, వీవీజే సుబ్రహ్మణ్యం, కె.శివప్రసాదరావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డుకు రేగులపాడు కేజీబీవీ

- వరుసగా రెండవ ఏడాది బెస్ట్ స్కూల్‌గా ఎంపిక
- హర్షం వ్యక్తం చేసిన కేజీబీవీ సిబ్బంది
- అభినందించిన జిల్లా అధికారులు



స్టేట్‌లో బెస్ట్ పాఠశాలగా రెండవసారి ఎంపికైన రేగులపాడు కేజీబీవీ



యోగాసనాలు వేస్తున్న కేజీబీవీ బాలికలు

వీరఘట్టం: బాలికావిద్యను ప్రోత్సహించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేజీబీవీలు సత్ఫలితాల నిస్తున్నాయి. ఈ క్రమంలో వీరఘట్టం మండలంలోని రేగులపాడు కేజీబీవీని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బాలికా విద్యాలయంగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు సీఎం ఆఫీసు అధికారులు రేగులపాడు కేజీబీవీకి ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఓ ఐ.ప్రమీల తెలిపారు. గతేడాది కూడా స్టేట్‌బెస్ట్‌గా ఎంపికైన రేగులపాడు కేజీబీవీకి వరుసగా రెండో ఏడాది కూడా ఉత్తమ విద్యాలయం అవార్డుకు ఎంపిక కావడంతో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పడిలేచిన కెరటంలా..

గతేడాది అప్పటి విద్యాశాఖ రాష్ట్ర ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రేగులపాడు కేజీబీవీని సందర్శించారు. ఇక్కడ 8వ తరగతి విద్యార్థులకు గణిత పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంపై బాధ్యులను చేస్తూ డీఈఓ, జీసీడీఓ, ఎంఈఓ, కేజీబీవీ ఎస్‌ఓలపై సెస్పెన్షన్ విధించారు. దీంతో రేగులపాడు కేజీబీవీ పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగింది. ఈ నేపథ్యంలో ఇక్కడి సిబ్బంది ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఎన్నో అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. అయినా సరే పట్టువీడకుండా బాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తూ గతేడాది పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించారు. మొత్తం 33 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందరూ ప్రథమస్థానంలో ఉత్తీర్ణులు కావడంతో పాటు వారిలో 21 మంది బాలికలు 500కు పైబడి మార్కులు సాధించారు. ఇలా తమ ప్రతిభతో రాష్ట్రం మొత్తం అభినందించేలా పడిలేచిన కెరటంలా దూసుకువచ్చారు. దీంతో వీరి ప్రతిభను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 352 కేజీబీవీలలో రేగులపాడు కేజీబీవీని బెస్ట్‌గా ఎంపిక చేసి వారి శ్రమ, పట్టుదల, కృషికి తగిన గుర్తింపు ఇచ్చింది. మళ్లీ ఈ విద్యా సంవత్సరంలో కూడా ఉత్తమ విద్యాలయంగా ఎంపిక అవ్వడంతో ఇక్కడి సిబ్బంది ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 15న జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోనుండడంతో కేజీబీవీ బాలికలు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాలతో..రాష్ట్ర స్థాయిలో గుర్తింపు

వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ బాలికలు ప్రతి ఏటా పదో తరగతిలో సాధిస్తున్న ఉత్తమ ఫలితాలే ఈ కేజీబీవీని రాష్ట్ర స్థాయిలో రెండుసార్లు ఉత్తమ కేజీబీవీగా నిలిపాయి. గడిచిన ఐదేళ్లుగా పదో తరగతిలో శతశాతం ఫలితాల సాధన, అన్ని కేజీబీవీల కంటే పదో తరగతిలో గరిష్ట మార్కులు సాధించడం, ప్రతి తరగతిలో గరిష్టంగా బాలికలు చేరడంతో పాటు గరిష్టంగా అటెండెన్స్ నమోదు కావడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రేగులపాడు కేజీబీవీని వరుసగా ఈ ఏడాది కూడా బెస్ట్ కేజీబీవీగా ఎంపిక చేశారు.

చాలా సంతోషంగా ఉంది

రాష్ట్రంలో ఉన్న 352 కేజీబీవీలలో ఉత్తమంగా రేగులపాడు కేజీబీవీని ప్రభుత్వం గుర్తించడం ఎంతో ఆనందంగా ఉంది.టీచర్ల సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు నమోదవుతున్నాయి. ఇక్కడ చేరిన బాలికలు క్రమశిక్షణతో విద్య నభ్యసిస్తారు. అందుకే శతశాతం ఫలితాలు సాధించగలుగుతున్నాం. వరుసగా రెండుసార్లు ఉత్తమ అవార్డు రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది.



ఐ.ప్రమీల,ఎస్‌ఓ, కేజీబీవీ, రేగులపాడు

ఇసుక లేదు.. రావద్దు



ఇసుక లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న కొత్తవలస ఇసుక యార్డు

కొత్తవలస: తమ్ముళ్లూ.. అవసరమైన వారందరికీ ఉచితంగానే ఇసుక సరఫరా చేస్తాం.. నిర్మాణ రంగానికి ఊతమిస్తామిస్తాం.. ఈ విషయాన్ని ఊరూరా చెప్పి ఓట్లు అడగండి అంటూ ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఊదరగొట్టారు. ఉచితంగానే ఇసుక ఇస్తున్నామంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కొత్తవలస, బొబ్బిలి, డెంకాడ వద్ద ఉన్న ఇసుక యార్డులలో స్టాక్ చేసిన ఇసుకను రవాణాచార్జీల పేరుతో అధిక వసూళ్లతో అమ్మకాలను ప్రారంభించారు. ఇప్పుడు కొత్తవలస, డెంకాడ యార్డుల్లో స్టాక్ చేసిన ఇసుక నిల్వలు అయిపోవడంతో చేతులెత్తేశారు. యార్డులను మూసేశారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నా కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. ఉచిత ఇసుక అంటూ హడావిడి చేసిన నేతలు ఇప్పుడు కనిపించడంలేదంటూ నిర్మాణరంగ వర్గాలు విమర్శిస్తున్నాయి.

4,829 టన్నుల ఇసుక ఏమైనట్టు?

గత ప్రభుత్వ హయాంలో ఎన్నిక నోటిఫికేషన్ వచ్చిన నాటికి కొత్తవలస ఇసుక యార్డులో 11,805 టన్నుల ఇసుక ఉన్నట్టు అధికారులు ధ్రువీకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత నెల 8న స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అమ్మకాలు ప్రారంభించారు. కేవలం 20 రోజుల్లోనే ఇసుక యార్డు పూర్తిగా ఖాళీ అయింది. 6,976 టన్నుల ఇసుకను అమ్మినట్టు అధికారుల రికార్డులు చూపుతున్నారు. మరి మిగిలిన 4,829 టన్నుల ఇసుక ఏమైందని నేతలకే ఎరుక.

మూలకు చేరిన వే బ్రిడ్జి, పొక్లెయిన్‌లు

గత ప్రభుత్వంలో కొత్తవలస ఇసుక యార్డు నుంచి ఇసుక విక్రయాలు ప్రభుత్వం నిర్ణయించిన సాధారణ ధరలకే జరిగేవి. వాహనాలు, ఇసుక విక్రయాలతో యార్డు నిత్యం కళకళలాడేది. ప్రస్తుతం యార్డులో కనీసం తట్టెడు ఇసుక లేదు. వే బ్రిడ్జి మూలకు చేరింది. అక్కడగల పొక్లెయిన్ కూడా మరమ్మతులకు గురై మూలకు చేరింది. సీసీ కెమెరాలు, ప్రింటర్లు, రికార్డులు ఆకతాయిల చేతిలో ధ్వంసమయ్యాయి. ఇదే విషయంపై తహసీల్దార్ నీలకంఠరావు మాట్లాడుతూ ప్రస్తుతం యార్డులో ఇసుక లేకపోవడంతో అక్కడ మా సిబ్బంది ఎవరూ విధుల్లో లేరన్నారు. ఇసుక వస్తే వీఆర్వోల పర్యవేక్షణలో అమ్మకాలు చేపడతామని చెప్పారు. ఇసుక నిల్వ బాధ్యత జిల్లా ఇసుక రీచ్ అధికారులదని పేర్కొన్నారు.